ప్రత్యక్ష సాక్షి
తెలుగు దినపత్రిక
RNI No.APTEL/2011/38267

విలేకరులు కావలెను
ప్రత్యక్ష సాక్షి దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలు మరియు నియోజకవర్గాల నుంచి పనిచేయుటకు విలేకరులు కావలెను. ప్రశ్నించే తత్వంతో పాటు నిజాన్ని నిర్భయంగా రాయగలిగే సత్తా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించండి : సెల్ : 99892 88546

సంపుటి : 15 సంచిక : 296 ఆదివారం 14-06-2026
ఎడిటర్ : కందుకూరి పరమేశ్వర్‌రావు, M.A. పేజీలు : 4 వెల : రూ2/-

# సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం..

## పార్టీని బలోపేతం చేస్తూనే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం.. పేద ప్రజల సంక్షేమం. అభివృద్ధి పైనే మా దృష్టి అంత.. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్**

**క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలి స్తున్నాం.. అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు.. ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడమే నా బాధ్యతగా ముందుకు సాగు తున్న.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రేవంత్ అన్న పాలనలో పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అందరికీ సముచిత గౌరవం ఇస్తూ వారి ఉన్నతికి పాటుపడుతున్నామని అని తెలిపారు. మా ప్రత్యక్ష సాక్షి ప్రతినిధి సాయితో, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు.** బిఆర్ఎస్ నేతల మాటలను ప్రజలు విశ్వసించరు. వాళ్ల మాటలన్నీ బట్టే బాజీ మాటలు.. వాళ్లు అధికారంలో ఉన్న.. 10 ఏండ్లు దోచుకున్నారు, దాచుకున్నారు తప్ప.. ప్రజలు చేసింది శూన్యం అని ఆయన విమర్శించారు. గత బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే లు.. వేలకోట్లకు ఎలా అధిపతు లయ్యారు.. లెక్కలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.మా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళుతున్నాం. బూత్ లెవెల్ ఏజెంట్లే మాకు..మా పార్టీకి వెన్నెముక లాంటి వాళ్ళు అని ఆయన తెలిపారు. 10 ఏళ్లలో దోచుకున్నంత.. దోచు కుని ముసలి కన్నీళ్లు కారిస్తే ప్రజలు..మిమ్మల్ని విశ్వసిస్తా రా..మీ బండారం అంతా ప్రజలు చూస్తున్నారు. పదవు లు పోగానే మీరు చేస్తున్న నాటకాలు మీరు చేస్తున్న హైడ్రామాలు అన్ని ప్రజలు గమనిస్తున్నారు.. గుర్తుంచుకో మాజీ ఎమ్మెల్యే దాస్యం.. నువ్వు చేసిన అరాచకాలు.. నువ్వు, నీ తమ్ముడు చేసిన భూకబ్జాలు ప్రజలందరికీ తెలుసు. అందుకే మూడు సార్లు గెలిచిన నిన్ను మట్టిలో కలిపారు. అయినా నీకు బుద్ధి రాలేదు..

నీకు మరో అవకాశం వస్తాది అన్న నమ్మకం కూడా లేదు.. ప్రజలు నీ మోసపు మాటలు నమ్మరు.. ఒకటి గుర్తు పెట్టుకో..అధికారుల్లో ఉన్న ప్పుడు నువ్వు చేసిన హంగా మా ఇచ్చిన హామీలు ప్రజలను మోసం చేసిన తీరు నీ నియోజ కవర్గ ప్రజల్లో.. నీ డివిజన్ ప్రజల్లో ఎంత అసంతృప్తి ఉందో.. నీ ప్రతి డివిజన్ కౌంటింగ్ లోనే నీకు తెలిసి ఉంటుంది కదా దాస్యం.. కనీసం వడ్డేపల్లి లో కూడా నువ్వు పుట్టి పెరిగిన నీ గ్రామంలో కూడా నీకు పడ్డ ఓట్ల శాతం గుర్తు తెచ్చుకో.. నువ్వు నమ్మిన నీ బంటులే నీకు అన్యాయం చేసిన.. నీకు ఇంకా అధికార వ్యామోహం తగ్గ లేదు..ఎప్పుడొచ్చి ఎమ్మెల్యే సీట్ లో కూర్చుంటాం అనే ధ్యాసే తప్ప.. దాస్యంకు మరో పని లేదు.. అయితే నువ్వు ప్రజలకు చేసింది ఏంటి అని అడుగుతే ఏం చెప్తావు. దాస్యం దోచుకున్నాను, దాచుకున్నాను అని చెప్పడం తప్ప.. అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. మూడు సార్లు ఎమ్మెల్యే గెలిచిన నువ్వు పశ్చిమ నియోజకవర్గ అభి వృద్ధికి ఏం చేశావు చెప్పు.. చర్చకు రా... నేను గెలిచి రెండున్నర ఏళ్ళు..నియోజక వర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానం లో నిలిపాను.. మిమ్మల్ని మీ పార్టీ నేతలు కార్యకర్తల్ని ఇబ్బందులు పెడుతున్నట్టు మీరు చెప్తున్నా మాటలు పూర్తిగా అవస్తవాలు.. రాజకీయ లబ్ధి కోసం మీరు చేస్తున్న హైడ్రామాలు ప్రజలు గమనిస్తున్నారు.. గుర్తుపెట్టుకో అని దాస్యమును ఆయన హెచ్చరించారు.

# ఫుల్ పైసా వసూల్ ప్యాకేజీ తీసుకొచ్చిన ఐఆర్‌సీటీసీ..

## రూ.15,600కే రామేశ్వరం సహా 7 ప్రముఖ ఆలయాల దర్శనం

(హైదరాబాద్)

రామేశ్వరం సహా దక్షిణ భారత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఒకేసారి సందర్శించాలని భావిస్తున్న వారికి ఐఆర్‌సీటీసీ స్పెషల్ ప్యాకేజీ తీసుకొచ్చింది. భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన దివ్య దక్షిణ యాత్ర విత్ అరుణాచలం ప్యాకేజీ ప్రకటించింది. ఈ ప్యాకేజీలో భాగంగా రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, తంజావూరు వంటి ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రాలను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే దర్శించుకునే అవకాశం కల్పిస్తోంది.

ఐఆర్‌సీటీసీ ప్రకటించిన ఈ టూర్ జూలై 20వ తేదీన ప్రారంభం కానుంది. మొత్తం 8 రాత్రులు, 9 రోజుల పాటు ఈ యాత్ర సాగనుంది. ఈ యాత్రలో 702 మంది ప్రయాణికులకు అనుమతి ఉండగా.. అందులో 160 స్లీపర్ క్లాస్, 490 థర్డ్ ఏసీ, 52 సెకండ్ ఏసీ సీట్లు ఉన్నాయి. ఈ స్పెషల్ ట్రైన్ సికింద్రాబాద్ నుంచి బయల్దేరనుంది. అయితే ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట తదితర స్టేషన్లలో కూడా ఎక్కే, దిగే అవకాశం కల్పించారు.

**ప్యాకేజీ వివరాలు ఇవే..!** ఈ యాత్రలో భాగంగా సికింద్రాబాద్ నుంచి బయల్దేరి తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర ఆలయం, చిదంబరంలోని నటరాజస్వామి ఆలయం, తిరుచ్చిలోని శ్రీరంగనాథస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వర ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, మధురైలోని మీనాక్షి అమ్మన్ ఆలయం, కన్యాకుమారిలోని అమ్మన్ ఆలయం, వివేకానంద రాక్ మెమోరియల్ తదితర ప్రదేశాలను సందర్శించనున్నారు.



**చార్జీలు ఎంతంటే..!** ప్రయాణికుల చార్జీల విషయానికి వస్తే.. స్లీపర్ క్లాస్‌లో ఒక్కో వ్యక్తికి రూ.15,600 వసూలు చేయనున్నారు. థర్డ్ ఏసీ క్లాస్‌కు రూ.23,100.. సెకండ్ ఏసీ క్లాస్‌కు రూ.29,500 చార్జీ చేస్తున్నారు. 5 నుంచి 11 సంవత్సరాల మధ్య వయసు గల చిన్నారులకు స్లీపర్ క్లాస్‌లో రూ.14,600.. థర్డ్ ఏసీలో రూ.21,900.. సెకండ్ ఏసీలో రూ.28,100గా ధరలు నిర్ణయించారు.

ఈ ప్యాకేజీలో భాగంగా యాత్ర మొత్తం రోజుల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం ఉచితంగా అందించనున్నారు. అదనంగా ప్రతి ప్రయాణికుడి ట్రావెల్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించనున్నారు. టూర్ ఎస్కార్ట్స్ కూడా అందించనున్నారు. దక్షిణ భారతంలోని ప్రముఖ దేవాలయాలను తక్కువ ఖర్చుతో దర్శించుకోవాలనుకునే భక్తులకు ఈ ప్యాకేజీ మంచి అవకాశంగా నిలవనుంది. ఆసక్తి గల వారు ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చు.

# లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల వృద్ధికి పెద్దపీట : మంత్రి శ్రీధర్‌బాబు



(హైదరాబాద్)

గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం'ను చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో హెచఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎగుమతుల సన్నద్ధత సూచీలో దేశవ్యాప్తంగా తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచిందన్నారు. అదే సముద్ర తీరం లేని రాష్ట్రాల(ల్యాండ్‌లాక్డ్) జాబితాలో రెండో స్థానంలో ఉందన్నారు. మర్చంటైజ్ ఎగుమతుల్లో దేశంలోనే ఏడో స్థానంలో నిలవడం తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి నిదర్శనమన్నారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్ లక్ష్యసాధనలో 'లాజిస్టిక్స్' రంగం కీలక పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడాన్ని ఒక పరిమితి(లిమిటేషన్)గా కాక ఒక డిజైన్ అడ్వాంటేజ్‌గా మార్చుకుంటున్నామన్నారు.

లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా రాష్ట్రంలో మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్‌హౌసింగ్, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేయబోతున్నామన్నారు. లాజిస్టిక్ రంగానికి అవసరమైన రెడీ టు స్కిల్డ్ వర్క్‌ఫోర్స్ తయారీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను లాజిస్టిక్ రంగంలోనూ సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, రైల్ లింక్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్-ఎ వేర్‌హౌసింగ్, ఆటోమేషన్, డిజిటల్ లాజిస్టిక్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్.రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కేకే మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ చైర్మన్ కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రతిష్ఠాత్మక ఐఐటి మరియు ఎన్ఐటిలలో "అల్ఫోర్స్" విద్యార్థులకు సీట్ల కేటాయింపు..

**ప్రత్యక్ష సాక్షి కరీంనగర్**

జె ఓ ఎస్ ఏ ఏ-2026 మొదటి రౌండు కౌన్సిలింగ్ ద్వారా 108 మంది అల్ఫోర్స్ విద్యార్థులకు జాతీయ స్థాయి ఐ.ఐ.టి మరియు ఎన్.ఐ.టి లలో సీట్లు కేటాయింపబడిన వని ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠాత్మక ఐ.ఐ.టి లలో 31 మంది విద్యార్థులు సీట్లు సాధించగా, ప్రతిష్ఠాత్మక ఎన్.ఐ.టిలలో 36 మంది విద్యార్థులు, వివిధ ఐఐటి లలో 16 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. అంతే కాకుండా 25 మంది విద్యా ర్థులు వివిధ IIEST, BIT, GFTI, SNIET, NIELIT మరియు జఖన సీట్లు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారు.

యుజిఈఈ ద్వారా మా అల్ఫోర్స్ విద్యార్థి జి. ఆశిస్ రెడ్డి ఐ ఐ ఐ టి- హైదరాబాద్లో సీటు సాధించడం విశేషం మరియు ఐఐటి జేఈఈ (మెయిన్స్) పర్సంటైల్ ద్వారా కుమారి పటేల్ అక్షయ రెడ్డి ట్రిబుల్ ఐటీ- హైదరాబాద్లో సీటు సాధించడం గమనార్హం. మొదటి రౌండు కౌన్సిలింగు లోనే 108 మంది విద్యార్థులు సీట్లు సాధించడం నాకెంతో ఆనందాన్నిస్తుంది. రాబోయే వివిధ రౌండులలో అనేక మంది అల్ఫోర్స్ విద్యార్థులు ప్రతిష్ఠాత్మక జాతీయస్థాయి విద్యాసంస్థలలో సీట్లు సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీట్లు సాధిం చిన మా అల్ఫోర్స్ చిన్నారు లను మరియు వారి తల్లి దండ్రులను ఆయన అభినందించారు.

# చైనాపై 'సముద్ర జీవుల' గూఢచర్యం..



(ఢిల్లీ)

తమ దేశ రహస్యాలను తెలుసుకునేందుకు శత్రు దేశాలు తాబేళు ్ల, చేపలను ఉపయోగిస్తున్నాయని చైనా ఆరోపించింది. తమ రహస్యాలు తెలుసుకోవడానికి పశ్చిమ దేశాల గూఢచారులు చైనా తీర ప్రాంతాల్లోని తాబేళ్లు, చేపలు వంటి సముద్ర జీవాలకు సెన్సర్లు అమర్చి వదులుతున్నట్లు చైనా మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. సున్నితమైన సముద్ర సమాచారాన్ని దొంగిలించడానికి అంతర్జాతీయ గూఢచార సంస్థలు సరికొత్త పరికరాలను వినియోగిస్తున్నాయని పేర్కొంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేసింది

చైనా తీర జలాల్లో సెన్సర్లు అమర్చిన పలు తాబేళ్లు, చేపలను గుర్తించినట్లు చైనా భద్రతా మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ జీవులు ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఈదుతూ నీటి ఉష్ణోగ్రత, లవణీయత, సముద్ర ప్రవాహం వంటి సముద్ర పర్యావరణానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిపింది. ఆ డేటాను ఉపగ్రహాల ద్వారా విదేశాలకు పంపుతున్నట్లు గుర్తించామని పేర్కొంది. సౌరశక్తితో నడిచే వేవ్ గ్లైడర్‌లు, పోర్ట్ డైనమిక్స్‌ను చిత్రీకరించగల సామర్థ్యం ఉన్న పరికరాలను విదేశీ బృందాలు సరకు రవాణా నౌకలపై అమర్చి తీర ప్రాంత సమాచారాన్ని సేకరించాయని ఆరోపించింది.

ఈ విధంగా సేకరించిన డేటాను ఉపయోగించి తమ జాతీయభద్రతకు తీవ్ర ముప్పును కలిగించడానికి పశ్చిమదేశాలు కుట్ర పన్నుతున్నాయని బీజింగ్ ఆరోపించింది. దీంతో ఇకపై విదేశాల నుంచి చైనాకు వచ్చే నౌకలు, పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించింది. సముద్రంలో ఏవైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని మత్స్యకారులకు సూచించింది.

# హైదరాబాద్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘన స్వాగతం పలికిన బీజేపీ అధికార ప్రతినిధి వెంకట రమణ

**ప్రత్యక్ష సాక్షి రంగశాయిపేట**

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం హైదరాబాద్ చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి పుష్కర కాలం (12 ఏళ్లు) పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "మేధావుల సమావేశం"లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 12 ఏళ్లలో దేశం అన్ని రంగాలలో సాధించిన ప్రగతిని, రక్షణ రంగంలో సాధించిన స్వయంసమృద్ధిని వివరించారు. దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి, అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్టను పెంచడంలో



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఆయన మేధావుల సదస్సులో ప్రముఖంగా ప్రస్తావించారు.

# అణగారిన ప్రజల ఆశయాలకు ప్రతీక "చే" గువేరా

## విప్లవానికి ప్రతీక... "చే" గువేరా గాథ

## జూన్ 14...విప్లవ యోధుడు చే గువేరా జయంతి

చరిత్రలో కొందరు వ్యక్తులు కాలానికి అతీతంగా నిలుస్తారు. వారి ఆలోచనలు, త్యాగాలు, ఉద్యమాలు తరతరాలను ప్రేరేపిస్తాయి. అటువంటి అజరామరమైన విప్లవ నాయకుల్లో ఒకరు ఎర్నెస్టో "చే" గువేరా --- లాటిన్ అమెరికా ఖండానికే కాకుండా, ప్రపంచంలోని అణగారిన ప్రజల ఆశయాలకు ప్రతీకగా నిలిచిన మహా యోధుడు. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియో పట్టణంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఎర్నెస్టో గువేరా డే లా సెర్నా చిన్నప్పటి నుంచే మేధావి, సంకల్పశక్తి కలవాడు. బాల్యంలో ఆస్తమా అనే దీర్ఘవ్యాధితో బాధపడినా, తన ధైర్యం, పట్టుదలతో దానిని అధిగమించాడు. వైద్యవిద్యను అభ్యసించిన ఆయన బ్యూనస్ ఎయిర్స్ విశ్వవిద్యాలయం నుండి 1953లో వైద్య పట్టా పొందాడు. మొదట మానవ సేవ ధ్యేయంగా వైద్యవృత్తి ద్వారా సమాజానికి సేవ చేయాలనుకున్న ఆయన, లాటిన్ అమెరికా పర్యటనల్లో పేదరికం, అన్యాయం, సామాజిక అసమానత, అమెరికా సామ్రాజ్యవాదం ఆధిపత్యం వంటి వాస్తవాలను ప్రత్యక్షంగా చూశాడు. ఈ అనుభవాలే ఆయన హృదయంలో విప్లవ జ్వాలలు రగిలించాయి. 1951--52లో తన స్నేహితుడు ఆల్బర్టో గ్రానాడోతో కలిసి మోటార్ సైకిల్‌పై దక్షిణ అమెరికా అంతటా చేసిన విస్తృత పర్యటన ఆయన జీవితానికి మలుపు తెచ్చింది. పెరూ, చిలీ, బొలీవియా, కొలంబియా వంటి దేశాల్లోని పేద ప్రజల దుస్థితిని గమనించి ఆయన మనసు మెలికలు తిరిగింది. ఈ అనుభవాలను ఆయన "ది మోటార్ సైకిల్ డైరీస్" అనే పుస్తకంలో అద్భుతంగా రాశాడు. ఆ యాత్ర ఆయనను ఒక వైద్యుడి నుండి ఒక విప్లవ యోధుడిగా మలచింది.

1954లో గ్వాటెమాలాలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని అమెరికా మద్దతుతో కూలదోయడాన్ని చూసినప్పుడు ఆయనలో పెట్టుబడిదారీ వ్యవస్థపై వ్యతిరేకత మరింత పెరిగింది. మెక్సికోలో 1955లో ఫిడెల్ కాస్ట్రో మరియు రౌల్ కాస్ట్రోలను కలవడం ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. కాస్ట్రో నేతృత్వంలోని "జులై 26 ఉద్యమం"లో చేరి క్యూబాలోని నియంత ఫుల్జెన్సియో బాటిస్టా ప్రభుత్వాన్ని కూలదోయడానికి గెరిల్లా యుద్ధంలో పాల్గొన్నాడు. మొదట వైద్యుడిగా, తర్వాత ధైర్యవంతమైన కమాండర్‌గా ఎదిగి "చే" అనే ముద్రను సంపాదించాడు --- ఇది అర్జెంటీనా భాషలో "స్నేహితుడు" అనే అర్థమున్న పదం.

1956 నుండి 1959 వరకు సాగిన క్యూబా విప్లవ యుద్ధంలో చేగువేరా కీలక పాత్ర పోషించాడు. ఆయన వ్యూహాలు, క్రమశిక్షణ, త్యాగం విప్లవ విజయానికి దోహద పడ్డాయి. ముఖ్యంగా సాంటా క్లారా నగరాన్ని స్వాధీనం చేసుకోవడం బాటిస్టా పరాభవానికి ప్రధాన కారణమైంది. 1959 జనవరి 1న ఫిడెల్ కాస్ట్రో హవానాలో అధికారాన్ని చేపట్టగా, చేగువేరా క్యూబా ప్రభుత్వంలో ప్రధాన నాయకుడిగా ఎదిగాడు. ఆయన క్యూబా జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా, తరువాత పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. క్యూబాను సామాజిక సమానత్వం, ఆర్థిక స్వావలంబన దిశగా



తీసుకెళ్లడానికి పలు సంస్కరణలు అమలు చేశాడు. అక్షరాస్యత ఉద్యమాన్ని నడిపించి, భూ సంస్కరణలను ప్రోత్సహించి, పేదలకు గౌరవప్రద జీవనం అందించేందుకు కృషి చేశాడు.

1959 జూలైలో ఆయన భారతదేశం సహా అనేక దేశాలను సందర్శించి సోషలిజం పట్ల అవగాహనను పెంపొందించాడు. ఆయన "నూతన మానవుడు" అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు --- భౌతిక సంపదల కన్నా నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే సమాజం ఏర్పడాలన్నది ఆయన కల. అధికారంలో ఉన్నా ఆయన మనసు విప్లవంలోనే మునిగిపోయి ఉండేది. క్యూబా స్వాతంత్ర్యం సాధించిన తరువాత కూడా లాటిన్ అమెరికా అంతటా ప్రజల విముక్తి కోసం పోరాటం కొనసాగించాలని ఆయన నిర్ణయించుకున్నాడు. 1965లో ఆయన క్యూబాను విడిచి ఆఫ్రికాలోని కాంగోలో విప్లవ ఉద్యమానికి పూనుకున్నాడు. అయితే అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేక ఆ యత్నం విఫలమైంది. అయినప్పటికీ ఆయన వెనుదిరగ లేదు. 1966లో ఆయన రహస్యంగా బొలీవియాకు వెళ్లి అక్కడ గెరిల్లా యుద్ధం ప్రారంభించాడు. బొలీవియాలో పీడిత రైతులను చైతన్య పరిచి కొత్త విప్లవాన్ని సృష్టించాలని ప్రయత్నించాడు. కాని స్థానిక మద్దతు లభించక పోవడంతో యుద్ధం కష్టాల్లో పడింది. చివరికి అమెరికా సిఐఎ మద్దతు పొందిన బొలీవియన్ సైన్యం చేత ఆయన 1967 అక్టోబర్ 8న పట్టుబడ్డాడు. అక్టోబర్ 9న లా హిగురా అనే గ్రామంలో ఆయన్ని కాల్చిచంపారు. మరణం ఆయన ఆలోచనలను చంపలేదు; విప్లవానికి కొత్త జీవం పోశింది. ఆయన చివరి మాటలు --- "నేను చనిపోతున్నాను, కానీ విప్లవం చనిపోదు" --- ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. విప్లవం, మానవతా భావం, సమానత్వం ఆయన ఆత్మలో పులకరించిన మూడు మూలస్తంభాలు. "ప్రపంచంలో ఎక్కడైనా అన్యాయం జరుగుతుంటే, అది ఎక్కడైనా ఉన్న న్యాయానికి ముప్పు" అనే ఆయన మాట నేటికీ సామాజిక చైతన్యానికి మార్గదర్శకం. అలాగే "నిజమైన విప్లవకారుడు గొప్ప ప్రేమతో నిండిన మనసు కలవాడు" అనే ఆయన వాక్యం యువతకు ప్రేరణగా నిలిచింది.


రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494

# గోదావరి తీరాన 'దక్షిణకాశి' వైభవం

# 2027 పుష్కరాల సవాళ్లు – సన్నద్ధత

## కేసీఆర్ స్వర్ణకంకణ మొక్కుల నుంచి రేవంత్ సర్కార్ మాస్టర్ ప్లాన్ దాకా: ధర్మపురి పుష్కర ప్రస్థానం





రామ కిష్టయ్య సంగన భట్ల, ధర్మపురి

గోదావరి పుష్కరాలు అనగానే సాధారణంగా అందరి మదిలోనూ మెదిలే మొదటి పేరు రాజమహేంద్రవరం. అయితే, అంతటి ప్రాచీన పౌరాణిక వైభవం, చారిత్రక నేపథ్యం ఉన్న గోదావరి నదీ తీర సంస్కృతి కేవలం ఆంధ్ర ప్రాంతానికే పరిమితం కాలేదు. సహస్రాబ్దాల ఆధ్యాత్మిక వారసత్వాన్ని తన గర్భంలో దాచుకున్న తెలంగాణలోని గోదావరి తీర క్షేత్రాలు కూడా పుష్కరాల సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన, సమానమైన ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. ఈ సుదీర్ఘ నదీ పరివాహక ప్రాంతంలో 'దక్షిణకాశి'గా, వైష్ణవ-శైవ సంప్రదాయాల సంగమ క్షేత్రంగా విరాజిల్లుతున్న జగత్ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి. జగజ్జనకుడు బ్రహ్మదేవుడు, లక్ష్మీసమేతుడైన నరసింహస్వామి, యమధర్మరాజు, శివుడు ఒకేచోట కొలువై ఉన్న త్రిమూర్తి సాన్నిధ్య వైభవం, వేదపారాయణ సంప్రదాయాలు కలగలిసిన ధర్మపురి క్షేత్రానికి గోదావరి పుష్కరాల చరిత్రలో ఒక ప్రత్యేకమైన, అద్వితీయమైన స్థానం ఉంది. ధర్మపురి పుష్కరాల ఆధునిక చరిత్రను పరిశీలిస్తే 2003 జూలై 30 నుంచి ఆగస్టు 10 వరకు జరిగిన ఉత్సవాలు ఒక మైలురాయిగా నిలిచాయి. ఆ సమయంలో ధర్మపురి శ్రీమఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతీ స్వామి పర్యవేక్షణలో గోదావరి నదీ తీరాన అత్యంత వైభవంగా నిర్వహించిన 'శతచండీ సహిత ఋగ్వేద సంహితా యాగం' ఆధ్యాత్మిక లోకాన్ని ఎంతగానో ఆకర్షించింది. విశేషమేమిటంటే, అప్పట్లో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపిస్తున్న అప్పటి టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఈ యాగానికి రాజకీయాలకతీతంగా పూర్తి అండదండలు అందించారు. పార్టీ నిధుల నుండి లక్షలాది రూపాయల విరాళాన్ని సమకూర్చడమే కాకుండా, పుష్కరాల తొలి రోజే సతీసమేతంగా ధర్మపురి ఘాట్‌లో పవిత్ర స్నానమాచరించారు. ఆ సమయంలో ఆయన "ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలి" అని గోదావరి తల్లికి మొక్కుకోవడం, ఆ తర్వాతి కాలంలో అది సాకారం కావడం గమనార్హం.

కాలక్రమంలో ఉద్యమం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత, తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ తన పూర్వ సంకల్పాన్ని మరువలేదు. సరిగ్గా 12 ఏళ్లకు, అంటే 2015 జూలై 14 నుంచి 25 వరకు జరిగిన 'గోదావరి మహా పుష్కరాల' (ప్రతి 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే బృహత్తర సంప్రదాయం) సందర్భంగా ఆయన ధర్మపురి క్షేత్రాన్ని ఎంచుకుని ప్రారంభ స్నాన సంకల్పం చేయడం విశేషం. గోదావరి తల్లికి కృతజ్ఞతగా సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నాడు తాము మొక్కుకున్న మొక్కుబడి కింద ఒక అద్భుతమైన స్వర్ణకంకణాన్ని తయారు చేయించి తెచ్చారు. ఆ స్వర్ణకంకణాన్ని దేవస్థాన ఆస్థాన వేదపండితుని హస్తానికి స్వయంగా తొడిగి తన భక్తిని చాటుకున్నారు. ఆ సమయంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా ఉన్న కొప్పుల ఈశ్వర్ చొరవతో ధర్మపురి రూపురేఖలు మార్చడానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. స్నానఘట్టాల విస్తరణ, రహదారుల వెడల్పు, తాత్కాలిక వసతులు, పారిశుద్ధ్య ఏర్పాట్లు ముమ్మరంగా సాగాయి.

అయితే, భక్తుల సంఖ్య అంచనాలను మించిపోవడంతో 2015 మహా పుష్కరాలు పాలకులకు, అధికారులకు ఒక పెద్ద పరీక్షగా మారాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలోని వివిధ గోదావరి ఘాట్లకు దాదాపు ఐదు కోట్లకు పైగా భక్తులు తరలిరాగా, అందులో అత్యధిక శాతం మంది ధర్మపురి క్షేత్రానికే పోటెత్తారు. ఫలితంగా ధర్మపురి పరిసర ప్రాంతాలలో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోయింది. ఎంతలా అంటే, అప్పటి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఈటెల రాజేందర్ వంటి ప్రముఖులే సాధారణ ప్రజలతో పాటు గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోవాల్సి వచ్చింది. ఈ సంఘటనలు భవిష్యత్తులో రాబోయే పుష్కరాల కోసం తాత్కాలిక ఏర్పాట్లు సరిపోవని, శాశ్వత మౌలిక వసతుల కల్పన, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళికలు ఎంత అత్యవసరమో స్పష్టమైన పాఠాలను నేర్పాయి.

ఈ గత అనుభవాలు, సవాళ్ల నేపథ్యంలో గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు అత్యంత వైభవంగా జరగబోయే రాబోయే గోదావరి పుష్కరాల కోసం ఇప్పటి నుంచే కసరత్తులు ప్రారంభం కావడం శుభపరిణామం. ప్రస్తుత జగిత్యాల జిల్లా పరిధిలోని ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గతంలో ఎదురైన రద్దీ సమస్యలను అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలతో ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డికి నివేదించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, అందులో మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను కీలక సభ్యునిగా నియమించింది. దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి, దేవాదాయ కమిషనర్, ఆలయ స్థపతి, ఆగమ సలహాదారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన అధికారుల బృందం ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి, ఘాట్ల విస్తరణ, శాశ్వత పార్కింగ్ స్థలాల గుర్తింపు, తాగునీరు, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై నివేదికలను సిద్ధం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం కేవలం ధర్మపురినే కాకుండా, బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న యావత్ గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఒకే మాలగా అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక పర్యాటక కారిడార్‌గా మార్చాలని సంకల్పించింది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా బాసర జ్ఞానసరస్వతి ఆలయాన్ని, కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రాన్ని సందర్శించి పనులను సమీక్షించారు. శనివారం ధర్మపురి సమీపంలోని గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకుస్థాపన జరగడం కూడా ఈ వ్యూహాత్మక అభివృద్ధిలో భాగమేనని చెప్పవచ్చు.

ఇదిలా ఉంటే, బాసర, కాళేశ్వరం, భద్రాచలం క్షేత్రాలకు అందుతున్న ప్రచారం, నిధుల ప్రకటనల జోరుతో పోలిస్తే, ధర్మపురి క్షేత్రానికి సంబంధించి ఇంకా నిర్దిష్టమైన మాస్టర్ ప్లాన్, కేటాయించే నిధుల అధికారిక వివరాలు పూర్తిస్థాయిలో బహిర్గతం కాకపోవడం స్థానిక భక్తులు, ఆలయాభిమానులలో కొంత ఆందోళనను, అసంతృప్తిని కలిగిస్తోంది. 'దక్షిణకాశి' అనే సముచిత గౌరవానికి తగ్గట్టుగా ధర్మపురిలో నదీ తీర రక్షణ గోడలు (రిటైనింగ్ వాల్స్), శాశ్వత భక్త నివాస సముదాయాలు, ఆధునిక శ్మశాన వాటికలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి పటిష్టమైన పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభం కావాలని క్షేత్రవాసులు కోరుతున్నారు.

నిజానికి, గోదావరి పుష్కరాలు అనేవి కేవలం పన్నెండు రోజుల పాటు జరిగే ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదు. అవి ఆయా ప్రాంతాల సాంస్కృతిక వైభవాన్ని చాటడమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, పర్యాటక రంగాన్ని విస్తరించడానికి మరియు వందలాది మందికి ఉపాధి కల్పించడానికి లభించే ఒక అద్భుతమైన సువర్ణావకాశం. గతకాలపు లోపాలను అధిగమిస్తూ, రాబోయే కాలపు భక్తుల రద్దీ అంచనాలకు తగినట్లుగా ముందస్తు వ్యూహాలతో అడుగులు వేయాల్సి ఉంది. ప్రభుత్వం, దేవాదాయ శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు భక్తజనం సమన్వయంతో కదిలి, ధర్మపురిని ఒక అంతర్జాతీయ స్థాయి యాత్రా కేంద్రంగా తీర్చిదిద్దగలిగితే, రాబోయే 2027 గోదావరి పుష్కరాలు తెలంగాణ నూతన చరిత్రలో పవిత్రమైన, శాశ్వతమైన విజయ అధ్యాయంగా నిలిచిపోవడం ఖాయం.

# పురస్కార గ్రహీత శర్మకు ఆత్మీయ సత్కారం..



ప్రత్యక్ష సాక్షి కరీంనగర్

శ్రీ చైతన్య పీజీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ నాగిళ్ల సదాశివ శర్మ ఇటీవల నెల్లూరు లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో "ఆచార్య రత్న" పురస్కా రాన్ని అఖిల భారత జాతీయ బ్రాహ్మణ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు అవధానం సాయి కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సంద ర్భంగా శర్మను విద్యా రంగా నికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. నేటి అధ్యా పకులు ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యా రంగ అభి వృద్ధి కి తగినంత సేవలందిం చాలని సూచించారు. అనం తరం శర్మను అధ్యాపకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందించి ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఎం.దత్తాత్రేయ శర్మ, కె. వి. ఎన్.ఆచార్య,సుబ్రహ్మణ్య శర్మ, మరియు కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎంకి ఘన స్వాగతం పలికిన మంత్రి అడ్లూరి..

కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాఫ్ రిపోర్టర్ జగిత్యాల

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మంచిర్యాల జిల్లా పర్యటన సందర్భంగా ధర్మపురి మండలం రాయపట్నం వద్ద రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మంత్రి గారి వెంట పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ తో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జీవుల మనుగడ కోసం మొక్కలు నాటుదాం..



మహబూబాబాద్

సృష్టిలో జీవుల మనగల కోసం మొక్కలు నాటుదామని బిజెపి మండలాధ్యక్షులు దుంపల సందీప్ పిలుపునిచ్చారు. భారత ప్రధానమంత్రి నరేంద్రనాథ్ దామోదర్ మోడీ ప్రారంభించిన అమ్మ పేరు పై ఒక మొక్క కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని మండల కేంద్రం ఇనుగుర్తిలో శనివారం బిజెపి మండల అధ్యక్షులు దుంపల సందీప్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. మానవాళికి ఉపయోగపడే వాటిని దేనిని నిర్లక్ష్యం చేయకుండా ప్రధాని మోదీ తాను ఆచరిస్తూ, ప్రజలను సైతం భాగస్వామ్యం చేయడం ఆయన దార్శనికతకు నిదర్శనమన్నారు. భవిష్యత్ తరాల కోసం మనకు జన్మనిచ్చిన అమ్మ పేరుతో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. మనం నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగి అనేక పశు,పక్షాదులకు ఆవాసాలుగా మారుతాయన్నారు. చెట్లు బ్రతికినంత కాలం నీడను,ఆక్సిజన్,కలపను ఇస్తూ పర్యావరణాన్ని పరిరక్షిస్తాయన్నారు. సృష్టిలో సమస్త జీవులు వృద్ధి చెందడంలో వృక్షాలు కీలక భూమిక పోషిస్తాయన్నారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పోలేపల్లివెంకటేశ్వర్లు జిల్లా సీనియర్ నాయకులు అనుమాండ్ల యాకూబ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నునావత్ బాలు నాయక్, సపావత్ సురేష్,మందుల బాబు,వెంకన్న బోడ నరేష్,వల్లముల రాజేందర్, గుగులోతు సురేందర్,దాసరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ఆహార కొరత ముప్పు

(ఢిల్లీ)

ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరగడం, మార్కెట్లలో అనిశ్చితి నెలకొనడం వల్ల ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు కేవలం 2.5 శాతానికే పరిమితం కానుందని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది. ఆరేళ్ల క్రితం అంతర్జాతీయ వాణిజ్యాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్-19 మహమ్మారి తర్వాత ఇదే అత్యంత బలహీనమైన ఆర్థిక వృద్ధి కావడం గమనార్హం. ఈ సంక్షోభం కారణంగా ప్రపంచంలోని మూడింట రెండు వంతుల దేశాల వృద్ధి రేటు అంచనాలను బ్యాంక్ సవరించింది. అమెరికా అతిపెద్ద ఇంధన ఉత్పత్తి దారు, ఎఐ రంగంలో పెట్టుబడుల వల్ల అమెరికా 2.2 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని అంచనా వేసింది.

యుద్ధ ప్రభావంతో అభివృద్ధి చెందుతున్న వర్ధమాన మార్కెట్ దేశాల 2026 వృద్ధి రేటు అంచనాను ప్రపంచ బ్యాంక్ 0.4 శాతం తగ్గించి 3.6 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. చైనా వృద్ధి రేటు ఈ ఏడాది 4.2 శాతంగా అంచనా వేయగా.. 21 యూరోపియన్ దేశాల వృద్ధి కేవలం 0.8 శాతానికి పడిపోనున్నాయి. భారతదేశం ప్రస్తుత ఏడాది 6.6 శాతం ఆర్థిక వృద్ధి రేటుకు పరిమితం కావొచ్చని అంచనా వేసింది. గతేడాది సాధించిన 7.7 శాతం వృద్ధితో పోలిస్తే ఈసారి కొంత మందగిస్తుందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది.

**మండిపోతున్న చమురు ధరలు..** అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు




ప్రతిచర్యగా ప్రపంచంలోని ఐదింట ఒక వంతు చమురు, సహజ వాయువు రవాణా అయ్యే కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది.

దీంతో ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. ఈ ఏడాది అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెండ్ క్రూడ్ చమురు ధర సగటున బారెల్‌కు 94 డాలర్లకు చేరుకోవచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఇది 2025 ధర కంటే 36 శాతం, జనవరిలో ఊహించిన దానికంటే 50 శాతం ఎక్కువ. ఇంధన సంక్షోభంతో పాటు పర్షియన్ గల్ఫ్ ద్వారా జరిగే ఎరువుల రవాణాకు తీవ్ర అంతరాయం కలగడం వల్ల ఎరువుల సరఫరా తగ్గనుంది. తద్వారా అంతర్జాతీయంగా తీవ్ర ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ప్రపంచ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది.

# పుచ్చకాయల్లో కల్తీ.. ఎలా గుర్తించాలంటే..?



వేసవి వచ్చిందంటే అసలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే ఆలోచనలో పడిపోతారు. ఉష్ణోగ్రత వల్ల వాతావరణంలో మార్పులు వస్తుంటాయి. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ శరీరం చల్లదనాన్ని కోరుకుంటుంది. చల్లగా ఉండే ప్రదేశంలో ఉండాలని,చల్లగా ఉండే పదర్థాలనే తినాలి అనిపిస్తుంది. అందులో ముఖ్యమైనది పుచ్చకాయ.

వేసవి వచ్చిందంటే పుచ్చకాయ వంటి పండ్లకు డిమాండ్ పెరుగుతుంది. ఈ డిమాండ్ వల్ల కల్తీ చేసే ప్రమాదం కూడా పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని,ఆహార భద్రత విభాగం ప్రజలను పుచ్చకాయలు కొనేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచనలు జారీ చేసింది.కృత్రిమ రంగులతో కలిపిన కుళ్ళిపోయిన పుచ్చకాయల విక్రయాన్ని అరికట్టేందుకు భాగంగా, ఇటీవల తిరుప్పూర్‌లోని విక్రయ కేంద్రాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అధికారులు 1,100 కిలోల లోపాలున్న పుచ్చకాయలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, నాణ్యత లేని 60 కిలోల పుచ్చకాయలను అధికారుల బృందం స్వాధీనం చేసినట్లు కూడా తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని,ఈ సీజన్‌లో సరైన పుచ్చకాయలను కొనడానికి 10 చిట్కాలను ఇక్కడ పేర్కొన్నారు. పుచ్చకాయ ఎలా ఉంది అని తనిఖీ చేయడానికి ఒక సులభమైన మార్గం దాని ఆకారాన్ని చూడటం. ఎల్లప్పుడూ ఒకే ఆకారంలో సమానమైన రూపంలో ఉన్న దాన్ని ఎంచుకోండి. ఆకారం లేదా పరిమాణంలో అసమానతలు అసమాన పక్వత లేదా సరైన పెరుగుదల పరిస్థితులు లేకపోవడాన్ని సూచిస్తాయి. ఇది పండు రుచి ఆకృతిని ప్రభావితం చేయవచ్చు. పుచ్చకాయ బయట తొక్కను పరిశీలించి, దానికి శక్తివంతమైన రంగులు మృదువైన, గట్టి ఆకృతి ఉన్నాయో లేదో చూడాలని కూడా సూచించబడింది. పండిన పుచ్చకాయ సాధారణంగా లోతైన ఆకుపచ్చ రంగులో ముదురు గీతలు లేదా మచ్చలతో ఉంటుంది. లేత రంగులో ఉన్న మెత్తని మచ్చలు ఉన్న పుచ్చకాయలను నివారించండి, ఎందుకంటే ఇవి చెడిపోవడాన్ని సూచించవచ్చు. భారత ఆహార భద్రత, ప్రమాణాల అధికార సంస్థ ప్రకారం, పుచ్చకా యను రెండు భాగాలుగా కోసి, పత్తిని తీసుకుని కొంత సమయం పుచ్చకాయపై రుద్దాలి. పుచ్చకాయ ఎరుపు రంగు నిజమైనదైతే, పత్తి బంతి ఎర్రగా మారదు. ఇది పుచ్చకాయ నిజమైనదని, దాని రంగుతో ఎటువంటి జోక్యం జరగలేదని చూపిస్తుంది. అలాగే, కొంతమంది విక్రేతలు పుచ్చకాయను ఎర్రగా కనిపించేలా ఇంజెక్షన్ చేస్తారు. కాబట్టి పత్తితో రుద్దినప్పుడు దాని రంగు ఎర్రగా మారుతుంది. పత్తి ఎర్రగా మారడం అంటే పుచ్చకాయలో ఇంజెక్షన్లు లేదా రసాయనాలు ఉపయోగించబడ్డాయని సూచిస్తుంది. ఇది మన ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి అలాంటి పుచ్చకాయలను తీసుకోవడం మానుకోండి. పండిన పుచ్చకాయ దాని పరిమాణానికి బరువుగా అనిపించాలి. ఎందుకంటే ఇది అధిక నీటి సాంద్రత, రసవంతమైనదని సూచిస్తుంది. పుచ్చకాయను ఎత్తి,దాని బరువును ఇతర సమాన పరిమాణంలో ఉన్న కాయలతో పోల్చండి. బరువైన పుచ్చకాయలు సాధారణంగా ఎక్కువ రసవంతంగా మరియు రుచికరంగా ఉంటాయి. పుచ్చకాయ ఉపరితలంపై చిన్న గోధుమ రంగు మచ్చలు లేదా గీతలు కనిపిస్తాయి. ఈ మచ్చలు పండులో అధిక చక్కెర సాంద్రత ఉందని అది తీపిగా రుచికరంగా ఉంటుందని సూచిస్తాయి. ఉత్తమ రుచి అనుభవం కోసం గుర్తించదగిన షుగర్ స్పాట్స్ ఉన్న పుచ్చకాయలను చూడండి.

నిపుణుల ప్రకారం, పుచ్చకాయ దిగువ భాగాన్ని, అంటే అది పెరుగుతున్నప్పుడు నేలపై ఉంచి బెల్లీ ని కూడా పరిశీలించాలి. పూర్తిగా పండిన పుచ్చకాయకు క్రీమీ లేదా బంగారు-పసుపు రంగు ఫీల్డ్ స్పాట్ ఉంటుంది. ఇది అది తీగపై పూర్తిగా పండినట్లు సూచిస్తుంది. పుచ్చకాయ ముక్కపై తెల్ల కాగితం లేదా టిష్యూ పేపర్‌ను రుద్ది, రంగులు కాగితానికి అంటుకోకపోతే రసాయనాలు లేవని నిర్ధారించుకోండి. కొన్నిసార్లు పుచ్చకాయలను గోడౌన్‌లలో నేలపై బహిరంగంగా నిల్వ చేస్తారు. ఇక్కడ ఎలుకలు వాటిని కొరుకుతాయి. బాహ్య గుర్తులపై దృష్టి పెట్టి, సంక్రమణ ప్రమాదాన్ని నివారించడానికి జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.


## వేసవికి.. వేప విరుగుడు

వేసవి ఉక్కపోతకు చెమట ఎక్కువ పడుతుంది. సాయంత్రానికి శరీరమంతా తడిసి ముద్దవుతుంది. కాటన్ బట్టలు వేసుకున్నా.. కంపు వాసన కొడతాయి. ఫలితంగా దురద, దానివెంటే దద్దుర్లు ఇబ్బంది పెడతాయి. ఇక ఏవైనా చర్మ సమస్యలు ఉంటే.. అవి మరింతగా విజృంభిస్తాయి. వీటినుంచి ఉపశమనం పొందడానికి వేలకు వేలు పోసి.. రకరకాల క్రీములు కొనాల్సిన పనిలేదు. అవి వాడినా.. సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. సహజ సిద్ధంగా, వీధుల్లో దొరికే 'వేపాకు'తోనే వీటికి చెక్ పెట్టొచ్చు. వేసవి సమస్యలను నివారించవచ్చు. మార్కెట్లో దొరికే ఖరీదైన క్రీములు, లోషన్లు అందరికీ ఉపశమనం కలిగించలేవు. సహజసిద్ధమైన దివ్యౌషధంగా పేరున్న వేపాకులు.. వేసవిలో వచ్చే అనేక సమస్యలకు పరిష్కారం చూపుతాయి. రూపాయి ఖర్చులేకుండా.. పూర్తిగా నిర్మూలిస్తాయి.


వేపనీటితో స్నానం..: ఒక కుండలో రెండు లీటర్ల నీటిని తీసుకొని, అందులో 15 నుంచి 20 తాజా వేపాకులు వేయాలి. ఈ నీటిని 10 నుంచి 15 నిమిషాలపాటు మరిగించాలి. నీరు వెచ్చగా ఉన్నప్పుడే.. స్నానపు నీటిలో కలపాలి. ఆ నీటితో స్నానం చేయడం వల్ల.. అనేక ప్రయోజనాలు కలుగుతాయి. వేపాకులకు బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నాశనంచేసే సామర్థ్యం ఉంటుంది. వేపాకులు యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్, యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి దురద నుంచి ఉపశమనాన్ని కలిగించడంతోపాటు ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ప్రతిరోజూ వేపనీటితో స్నానం చేయడం వల్ల చెమట కారణంగా శరీరం నుంచి వచ్చే దుర్వాసన తగ్గుతుంది. దురదతోపాటు దద్దుర్ల బాధ తప్పుతుంది. శరీరంలో ఉత్పత్తి అయ్యే బ్యాక్టీరియా నశించిపోతుంది. చర్మం మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.


వేపతో పసుపు..: చర్మ సమస్యలు కూడా ఉన్నట్టయితే.. వేసవిలో మరింత ఇబ్బంది పడాల్సి వస్తుంది. అలాంటివారు వేపాకులకు పసుపును కలిపితే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. 8 నుంచి 10 వేపాకులను మెత్తగా గ్రైండ్ చేసి.. అందులో అర టీస్పూన్ పసుపు కలపండి. ఈ పేస్ట్‌ను దురద ఎక్కువగా ఉన్న ప్రాంతంలో అప్లయి చేయాలి. 20 నిమిషాలపాటు అలాగే ఆరనిచ్చి.. గోరువెచ్చని నీటితో కడిగేయాలి. పసుపులో యాంటి సెప్టిక్ లక్షణాలు ఉంటాయి. ఇవి వేపతో కలిసి.. చర్మపు చికాకును తగ్గిస్తాయి. దురద నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ముఖ్యంగా తామర, సోరియాసిస్ లాంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లతో బాధపడేవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## నడకే దివ్యౌషధం




జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ తగ్గడం వల్ల.. హృద్రోగ బాధితులు పెరుగుతున్నారు. 30 ఏండ్లకే గుండె జబ్బులను స్వాగతిస్తున్నారు. ఇలాంటివారు సరైన జీవనశైలిని పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, నడకను దినచర్యలో భాగం చేసుకుంటే.. హృదయం తేలికపడుతుందని అంటున్నారు. రోజూ కనీసం అరగంట వాకింగ్ చేస్తే.. ఆరోగ్యాన్ని నియంత్రణలో ఉంచుకోవచ్చని చెబుతున్నారు. గుండె జబ్బు వచ్చిందంటే.. వ్యాయామానికి దూరం అవుతుంటారు. కేవలం మందులు, ఆహారంలో జాగ్రత్తలతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అనుకుంటారు. వ్యాయామం చేస్తే గుండెపై భారం పడుతుందనీ, ఇట్టే అలసిపోతామని అనుకుంటారు. కానీ, హృద్రోగులకు నడకకు మించిన వ్యాయామం లేదు. మందులు, ఆహారంతోపాటు రోజూ అరగంట నడక వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మొదటి ఐదు నిమిషాలు చాలా నెమ్మదిగా నడవాలి. దీంతో వ్యాయాయానికి శరీరం సిద్ధమవుతుంది. నిదానంగా వేగాన్ని పెంచుకుంటూ పోవాలి. మళ్లీ వేగాన్ని నెమ్మదిగా తగ్గించుకుంటూ రావాలి. అలాకాకుండా ఒకేసారి నడక వేగాన్ని తగ్గిస్తే.. తలతిరగడం లాంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. ఎక్కువ వేగంతో తక్కువ దూరం నడవడం కన్నా.. తక్కువ వేగంతో ఎక్కువ దూరం నడిస్తే మంచి ఫలితం ఉంటుంది. కడుపు నిండా తిన్న తర్వాత వాకింగ్ చేయడం అంతమంచిది కాదు.నడక వల్ల గుండె వేగంతోపాటు శ్వాసరేటు క్రమబద్ధంగా పెరుగుతుంది. రక్తంలో ఆక్సిజన్ స్థాయులూ పెరిగి.. గుండె, ఊపిరితిత్తులు బలోపేతం అవుతాయి. రోజూ అరగంట నడవడం వల్ల రక్తపోటు తగ్గడంతోపాటు, రక్తంలో గ్లూకోజ్ అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కండరాల సామర్థ్యం మెరుగవుతుంది.





# బాధ్యతల్లో బందీ!





కార్పొరేట్ సంస్థల విజయాల్లో మహిళా నాయకులు కీలకపాత్ర పోషిస్తున్నారు. అదే సమయంలో.. వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మాత్రం వెనకబడి పోతున్నారు. నాయకత్వ బాధ్యతల్లో ఉన్న మహిళలు.. ఆ విధుల్లో బందీలుగా మారుతున్నారు. అనేక మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఈ విషయాలను పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సంస్థల అభివృద్ధి కోసం కృషిచేస్తున్నవారి శ్రేయస్సును కార్పొరేట్ సంస్థలు గాలికి వదిలేస్తున్నాయని విమర్శిస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలను విజయతీరాలకు చేర్చాలంటే ఎన్నో అడ్డంకులను అధిగమించాలి. మరెన్నో సవాళ్లను ఎదుర్కోవాలి. ఈక్రమంలో నాయకత్వ స్థానాల్లో కీలకంగా ఉన్న మహిళలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారట. ఈ సమస్య కంటికి కనిపించకుండా.. చాపకింది నీరులా విస్తరిస్తున్నదట. ఫలితంగా, లేడీబాస్‌లు ఎక్కువగా బర్న్ అవుట్ అవుతున్నారు. ఈ సంక్షోభం.. భవిష్యత్తులో తీవ్రమైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉన్నదని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. మహిళలు ద్విపాత్రాభినయం చేయడమేనని చెబుతున్నారు. నాయకత్వ స్థానాల్లో ఉన్న మహిళలు.. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఊపిరి సలపని పనులతో సతమతం అవుతుంటారు. అదే సమయంలో ఇంటి బాధ్యతలను కూడా నిర్వహిస్తుంటారు. ఇక పురుషులతో పోలిస్తే.. మహిళా నాయకులపైనే అధిక అంచనాలు ఉంటున్నాయి. ఈ కారణం కూడా వారిపై ఒత్తిడిని పెంచుతున్నదని ప్రముఖ కన్సల్టింగ్ సంస్థలు నిర్వహించిన అధ్యయనాల్లో తేల్చాయి. ఉన్నత స్థానాల్లో ఉండే పురుషుల్లో 31శాతం మంది మెంటల్లీ బర్న్ అవుట్ అవుతుండగా.. మహిళల వాటా 43 శాతం ఉన్నదని వెల్లడిస్తున్నాయి. పెద్దస్థాయిలో పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న మహిళల్లో హృద్రోగాలు వచ్చే అవకాశం 50% ఎక్కువగా ఉన్నదని తేలింది. ఆందోళన, నిరాశలో కూరుకుపోయే ప్రమాదం పురుషులతో పోలిస్తే.. 1.6 రెట్లు ఎక్కువట. అధిక ఒత్తిడితో పనిచేసే మహిళల్లో నిద్రలేమి, జీవక్రియలు మందగించడం, రోగ నిరోధక వ్యవస్థ పనితీరు కూడా తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బర్న్ అవుట్స్.. రక్తపోటు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కూడా హెచ్చరిస్తున్నది. అయితే.. మహిళా నాయకుల్లో ఈ వర్క్ ఓవర్‌లోడ్, బర్న్ అవుట్‌ను పరిష్కరించడం కేవలం వ్యక్తిగత బాధ్యత కాదనీ, నేరుగా ఎదుర్కోవాల్సిన సంస్థాగత సవాలు అని అంటున్నారు మానసిక నిపుణులు. కార్పొరేట్ కంపెనీలు తమ మహిళా నాయకుల ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడటానికి విశ్వసనీయ వ్యూహాలను అభివృద్ధి చేయాలని సూచిస్తున్నారు. సౌకర్యవంతమైన పని వసతులు, మానసిక ఆరోగ్య వనరులు, నిర్మాణాత్మక మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించాలని చెబుతున్నారు. చివరగా.. వ్యాపారంలో విజయం సాధించాలంటే.. దానికి నాయకత్వం వహించేవారి ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలి. అందులోనూ మహిళలపై మరింత ఎక్కువ ఫోకస్ పెట్టాలి. వారి ఆరోగ్యం, మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే సంస్థలు.. అగ్రశ్రేణి ప్రతిభను నిలుపుకోవడంతోపాటు మరింత స్థిరమైన అభివృద్ధిని సాధిస్తాయని నిపుణులు చెప్పుకొస్తున్నారు.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..?

### అయితే ప్రోటీన్ల లోపం ఉందేమో చెక్ చేసుకోండి..!

మన శరీరానికి స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు రెండూ అవసరం అన్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ప్రోటీన్లు స్థూల పోషకాల కిందకు వస్తాయి. అంటే ప్రోటీన్లను మనం నిత్యం ఎక్కువ మొత్తంలో తీసుకోవాలన్నమాట. ప్రోటీన్లు మన శరరీంలో అనేక విధులను నిర్వహిస్తాయి. ప్రోటీన్ల వల్ల జీవక్రియలు సరిగ్గా నిర్వహించబడతాయి. అలాగే కండరాలు అభివృద్ధి చెందుతాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. అయితే కొందరు నిత్యం కార్బొహైడ్రేట్లు లేదా కొవ్వులను అధికంగా తింటుంటారు. ప్రోటీన్లను సరిగ్గా తీసుకోరు. దీంతో ప్రోటీన్ల లోపం ఏర్పడుతుంది. ఇది వస్తే ప్రమాదంలో పడినట్లే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కనుక ప్రోటీన్ల లోపం ఏర్పడకుండా చూసుకోవాలి. అయితే మన శరీరానికి ప్రోటీన్లు సరిగ్గా లభించకపోతే అప్పుడు మన శరీరం కొన్ని సంకేతాలను తెలియజేస్తుంది. అవేమిటంటే..

**జుట్టు ఆరోగ్యం..:** ప్రోటీన్లను సరిగ్గా తీసుకోకపోతే మన శరీరంలోని కండరాలకు శక్తి సరిగ్గా లభించదు. దీంతో కండరాలు బలహీనంగా మారి నొప్పి వస్తాయి. రోజూ మీరు చేసే చిన్న చిన్న పనులను కూడా చేయలేకపోతుంటారు. కండరాలను టచ్ చేస్తే చాలు తీవ్రమైన నొప్పి ఉంటుంది. ఈ లక్షణాలు కనిపిస్తుంటే ప్రోటీన్ల లోపం వచ్చిందని అర్థం చేసుకోవాలి. అలాగే ప్రోటీన్ల లోపం జుట్టు ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపిస్తుంది. ప్రోటీన్ల లోపం ఉంటే జుట్టుకు పోషణ లభించదు. దీంతో జుట్టు పలుచగా మారుతుంది. బలహీనమవుతుంది. జుట్టు నిర్జీవంగా కనిపిస్తుంది. జుట్టు కుదుళు కూడా బలహీనంగా మారి జుట్టు రాలుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తున్నా కూడా ప్రోటీన్ల లోపం ఉందని అర్థం చేసుకోవాలి.

**రోగ నిరోధక వ్యవస్థ..:** మన శరీర రోగ నిరోధక వ్యవస్థ సాఫీగా పనిచేయాలంటే అందుకు ప్రోటీన్లు అవసరం అవుతాయి. అయితే ప్రోటీన్ల లోపం ఉంటే దాని ప్రభావం రోగ నిరోధక వ్యవస్థపై కూడా పడుతుంది. దీంతో ఇమ్యూనిటీ తగ్గిపోతుంది. ఫలితంగా తరచూ దగ్గు, జలుబు, ఫ్లూ బారిన పడుతుంటారు. లేదా ఈ వ్యాధులు వస్తే ఒక పట్టాన తగ్గవు. నెలల తరబడి అలాగే ఉంటాయి. ఈ లక్షణాలు కూడా ప్రోటీన్ లోపాన్ని తెలియజేస్తాయి. అలాగే ప్రోటీన్ల లోపం ఉంటే శరీరానికి శక్తి సరిగ్గా లభించక తీవ్రమైన అలసట, నీరసం ఉంటాయి. చిన్న పని చేసినా కూడా విపరీతంగా అలసిపోతారు. మెట్లు ఎక్కలేకపోతుంటారు. ఆయాసం వస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలు తగ్గినట్లు అనిపిస్తుంది. బలహీనంగా మారిపోతారు. ఇవన్నీ ప్రోటీన్ల లోపం ఉందని చెప్పే లక్షణాలే.

**నొప్పులు, వాపులు..:** ప్రోటీన్ల లోపం ఉంటే ఉన్నట్లుండి సడెన్ గా బరువు పెరగడమో లేదా తగ్గడమో జరుగుతుంది. అధిక బరువు ఉన్నవారు బరువును తగ్గించుకోలేకపోతుంటారు. అలాగే పాదాలు, అర చేతులతోపాటు శరీరంలోని ఇతర భాగాల్లోనూ వాపులు కనిపిస్తాయి. ఆ ప్రాంతంలో నొక్కితే సొట్టపడి చర్మం లోపలికి పోతుంది. ఆయా భాగాల్లో విపరీతమైన నొప్పి ఉంటుంది. నొప్పిని భరించలేకపోతుంటారు. ప్రోటీన్ల లోపం కారణంగా శరీరంలో ద్రవాల అసమతుల్యత ఏర్పడి అలా జరుగుతుంది. కనుక ఈ లక్షణాలను కూడా ప్రోటీన్ల లోపంగానే భావించాలి. ప్రోటీన్ల లోపం ఉంటే గోర్లకు సరిగ్గా పోషకాలు లభించవు. దీంతో గోర్లు బలహీనంగా మారి విరిగిపోతుంటాయి. గోర్లు పలుచగా మారిపోతాయి. అలాగే కొందరి గోర్లు రంగు కూడా మారుతాయి. ఇలా పలు లక్షణాలను బట్టి ప్రోటీన్ల లోపం వచ్చిందని అర్థం చేసుకోవచ్చు. డాక్టర్ వద్దకు వెళితే సరైన చికిత్స అందిస్తారు. ప్రోటీన్ల లోపం పోవాలంటే ప్రోటీన్లు ఉండే ఆహారాలను రోజూ తినాల్సి ఉంటుంది.

# చిత్రలేఖన పోటీలలో సెయింట్ పీటర్స్" విద్యార్థుల ప్రతిభ

## విద్యార్థులను అభినందించిన పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్. గోపు మత్యాస్ రెడ్డి.. డైరెక్టర్ గోపు సునీత రెడ్డి



సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

ప్రపంచ పర్యావరణ దినోత్స వం సందర్భంగా వరంగల్ జిల్లా అటవీ శాఖ -వరంగల్ వారు నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో జూనియర్స్ విభాగంలో సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ఓల్డ్ బస్ డిపో రోడ్. హనుమ కొండ ఏ.ఉషశ్రీ. 7 వ తరగతి (ప్రథమ బహుమతి)జె. అలెక్సియా 6వ తరగతి (ద్వితీయ బహు మతి),ఈ బహుమతులను వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అడిషనల్ కలెక్టర్ గణేష్, డీఎఫ్ఓ నికిత చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు..

వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్.గోపు మాథ్యా స్ రెడ్డి,డైరెక్టర్..గోపు సునీత రెడ్డి, విద్యార్థులను అభినందిం చారు మరియు డ్రాయింగ్ టీచర్ రాపోలు శ్రీనివాస్ ను అభినందించారు

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేసిన జువ్వాడి



డి సుధాకర్ ప్రత్యక్ష సాక్షి మెట్ పల్లి టౌన్

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోకాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ రావుహాహాసీఎంఆర్ చెక్కులు మూడు మండలాల 47 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారుహాహాఅనంతరం లో 47 మందికి గాను 17లక్షల 72 వేల రూపాయలు విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ అనంతరం మెట్ పల్లి పట్టణం లో గంగపుత్ర సంఘ అభివృద్ధి పనులకు మరియు కోరుట్ల పట్టణంలో పెద్దమ్మ ఆలయ అభివృద్ధి కోరకు మరియు ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలో గంగపుత్ర సంఘశీ మరియు గ్రామంలో స్మశాన వాటిక దగ్గర 2 బోర్లను ఎస్ డి ఎఫ్హాహానిధుల నుండి నిధులు మంజూరు చేసిహాహాప్రోసిడింగ్ పత్రాలను ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ పండ్లు చెక్కులు అత్యధికంగా మంజూరు అవుతున్నాయని అత్యవసర పరిస్థితిలో ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందిన వారికి ఆర్థిక సహాయం చేయలన ఉద్దేశంతో ఈ సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా కొంతమేర సహాయపడుతున్న ఉద్దేశంతో అత్యధికంగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని మెట్ పల్లిహాహాకోరుట్ల పరిసర మండలాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అత్యధిక చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రిగారు వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రైసోద్దీన్ జలపతి రెడ్డి గంగాధర్ జెట్టి లక్ష్మణ్ కౌన్సిలర్స్హాహాకో ఆప్షన్ సభ్యులు మూడు మండలాల సర్పంచులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నరు.

# ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసిన టీజీవో నాయకులు..



సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్ మోహన్ రావు నాయ కత్వంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గెజి టెడ్ అధికారులు ఎదుర్కొం టున్న వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. వరంగల్ నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల విషయంలో మరియు మామునురు ఎయిర్ పోర్ట్ ఏర్పాటు విషయంలో రాజేందర్ రెడ్డి తీసుకున్న చొరవను అభినంది ంచారు. ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను అధికారులు అందరూ చిత్తశుద్ధితో అమలు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చా రు. ఈ సందర్భంగా వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ లో జిల్లా అధికా రులకు మరియు గెజిటెడ్ అధికారులకు ప్రాతి నిధ్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లా డుతూ నగర అభివృద్ధికి అధికారులు అందరూ సహక రించాలని, ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉద్యోగుల పెండింగ్ సమస్యల న్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దశల వారిగా పరిష్కరిస్తారని తెలిపారు. ఆఫీసర్స్ క్లబ్ విషయంలో అధికారులకు తగిన ప్రాతినిధ్యం ఉండే విధంగా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో టీజీవో రాష్ట్ర కార్యదర్శి కోలా రాజేష్ కుమార్ గౌడ్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్,ఈగ వెంక టేశ్వర్లు,సురేష్ కుమార్, మాధవ రెడ్డి,రఘుపతి రెడ్డి, పాక శ్రీనివాస్,సతీష్ రెడ్డి, రాంచందర్ రావు మరియు జగన్ మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు.

# ధర్మపురి పోలీస్ స్టేషన్, తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్..



కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాఫ్ రిపోర్టర్ జగిత్యాల

జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ధర్మపురి పోలీస్ స్టేషన్‌తో పాటు ధర్మపురి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని , సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను,పరిశీలించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సి.ఐ కి సూచించారు. కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా సి సి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామశీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి,ప్రజలతో మమేకమై శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐలు మహేష్, రవీందర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అలరించిన చేపూరి శ్రీరామ్ అష్టావధానం..

## సనాతన ధర్మాన్ని నిలబెట్టడానికి సాహితీ కార్యక్రమాలు ఎంతో అవసరం.. ధార్మిక సంస్థల నిర్వాహకులు గట్టు మహేష్ బాబు



సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

విష్ణు మాసంగా పిలువబడే అధిక జ్యేష్ఠమాసశీ ద్వాదశిని పురస్కరించుకుని రెవెన్యూ కాలనీ రామాలయంలో శృంగేరి పీఠప్రవచకులు అన్నావఝ్ఝల సోంబాబు శర్మ అధ్యక్షతన ప్రముఖ అవధాని చేపూరి శ్రీరామ్ చే అష్టావ ధానం నిర్వహించారు. ఈ సాహిత్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక సేవా పరాయణులు, ధార్మిక సంస్థల నిర్వాహకులు గట్టు మహేశుబాబు పాల్గొన్నారు. మన దేశం విశ్వగురు స్థానాన్ని పటిష్టపరిచే సనాతన ధర్మాన్ని నిలబెట్టడానికి సాహితీ కార్యక్ర మాలు ఎంతో అవసరమన్నారు. కేవలం తెలుగు భాషకే పరిమితమైన అవధాన ప్రక్రియను ప్రతి ఒక్కరూ ఆదరించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఇలాంటి వైవిధ్య సాహిత్య కార్యక్రమాలకు తన వంతుగా చేయూత అందిస్తా నని తెలిపారు. మరో అతిథి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తిరునగరి నరేందర్ మాట్లాడు తూ అవధానం మన సాహిత్య మాగాణి అయిన ఓరుగల్లులో కోవెల సుప్రసన్నా చార్య,ఇందారపు కిషన్రావు ల అనంతరం మరుగున పడుతుందనుకుంటున్న తరుణంలో యువ అవధానులుగా చేపూరి శ్రీరామ్, తిరుక్కోవళ్ళూర్ శ్రీహర్ష లను తీర్చి దిద్దిన కంది శంకరయ్య అభినందనీయులు అని ప్రశంసించారు..

తర్వాత ఏర్పాటు చేసిన అష్టావ ధానానికి పద్యవశంకరులు, సమస్యాపృచ్ఛక చక్రవర్తి కంది శంకరయ్య సంచాలకత్వం చేయగా శతావధాని, అవధానప్రియ,చేపూరి శ్రీరామ్ "రామాయణ వైశిష్ట్యం " అంశంపై అద్భుత అవధానం చేసారు. ప్రాశ్నికులు వేసిన ప్రశ్నలన్నీ రామాయణ సంబంధంగా ఉండడం అవధాని శ్రీరామ్ కావడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. కార్యక్రమం ఆసాంతం పద్యప్రేమికులను రంజింప చేసింది. చివరన అవధాని ని,సంచాలకులను ప్రాశ్నికులను ముఖ్య అతిథిమహేష్ బాబు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ లెక్చరర్ కలువల రాజేశ్వరశర్మ, కాకతీయ పద్యకవితా వేదిక సభ్యులు జీడికంటి శ్రీనివాస మూర్తి, యువ అష్టావధాని తిరుక్కోవ ల్లూరు శ్రీహర్ష,అక్కెర కరుణా సాగర్ లతో పాటు జి.విష్ణు మూర్తి,ముదిగొండ రమాదేవి, టి. శ్రీదేవి, టి.నరహరి, పి.భాస్కర్,ఆనందచారి, గోపాల్ రెడ్డి,సతీశ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉచిత వేసవి క్రికెట్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలు..

## యువతలోని క్రీడా నైపుణ్య తలను వెలికి తీసేందుకే ఈ పోటీలు..

### కుడా చైర్మన్, హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి






సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

హైదరాబాద్ క్రికెట్ అసోసి యేషన్ సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంగపల్లిలోని డబ్ల్యూడీసీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన "ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం" ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హనుమ కొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యా రు.

ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీయ డానికి డబ్ల్యూడీసీఏ, హెచ్‌సీఏ సంయుక్తంగా ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిం చడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారుల ప్రోత్సా హానికి పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. యువ క్రికెటర్లు క్రమశిక్షణతో ఆడుతూ, ఫిట్‌నెస్‌పై దృష్టి సారించి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించేలా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం యువ క్రీడాకారులకు సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు.

ఈ ముగింపు వేడుకల్లో డబ్ల్యూడీసీఏ నిర్వాహకులు, హెచ్‌సీఏ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటన ఇద్దరికీ తీవ్ర గాయాలు

యాదవ రావు ప్రత్యక్ష సాక్షి పోతంగల్

నిజామాబాద్ జిల్లా పోతంగల్ నుండి బీర్కూరు వెళ్లే రహదారిపై పొతంగల్ మండలం జల్లపల్లి ఆబాది సమీపంలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది.

ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు.

కల్లూర్ గ్రామానికి చెందిన ఇద్దరు బైక్పై పొతంగల్ నుంచి కల్లూర్ వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టినట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు 108 అంబులెన్స్లో బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# శ్రీ వాసవి మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు..

ప్రత్యక్ష సాక్షి , సుల్తానాబాద్

సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి (వాసవి మాత దేవాలయం)లో అధిక జేష్ట మాసం పురస్కరించుకొని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అమ్మవారికి ఓడి బియ్యం సారే సమర్పించారు, పలు రకాలకు చెందిన 33 నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు, ఆలయ అర్చకులు వల్లకొండ మఠం మహేష్ , పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు బాదం వాణి అధికమాస ప్రత్యేకతను వివరించారు, అనంతరం వాసవి మాత పల్లకి సేవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు, ప్రముఖ రైస్ మిల్ వ్యాపారవేత్త నార్ల వెంకన్న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమం లో వాసవి మాత దేవాలయం చైర్మన్ చకిలం మారుతి, పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి, అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శి తోడుపునూరి రాజేంద్రప్రసాద్ , క్యాషియర్ కొమురవెల్లి



(కేబి) శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షులు రామిడి రవీందర్, ఆర్యవైశ్య యూత్ అధ్యక్షులు మాదూరి సందీప్ , సామాజిక సేవకులు పల్లకిషన్ పలువురు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు...

printed,published and owned by Kandukuri Parameshwar Rao, printed at Rimsha printers,. H .no 5-16/1, Algunoor,Mandal Thimmapur, Dist Karimnagar (TS) place of Publication H.NO.1-2-31/4/B/1 krishna nagar jagital dist(TS).cell no.99892 88546, Editor K.Parameshwar rao. RNI No.APTEL/2011/38267. kprao1961@gmail.com